క్లుప్తంగా

ఇంటెలిజెన్స్ ఎస్సైగా పదోన్నతి


సత్యనారాయణ

సత్తుపల్లి: సత్తుపల్లి ఇంటెలిజెన్స్ ఏఎస్సైగా పని చేస్తున్న సూర సత్యనారాయణకు ఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు శనివారం వరంగల్ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వరంగల్ డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన ఉత్తర్వులు స్వీకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ముదిగొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్‌లు పంచాయతీ కార్మికులకు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల వేతనాలు విడుదల చేయాలి

కారేపల్లి: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని జీపీ వర్కర్ల సంఘం జిల్లా నాయకుడు షేక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని భజ్యాతండా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సూక్యా, పాప్యా, మోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కారేపల్లి: టీఎన్జీవో రఘునాథపాలెం యూనిట్ పరిధిలోని సకల ఉద్యోగులకు ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో నవంబర్ 3న నిర్వహించే వనసమారాధన, వన భోజనమహోత్సవానికి హాజరు కావాలంటూ.. శనివారం కారేపల్లి పోలీస్ స్టేషన్లో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షులు మెట్టు వీరన్న, కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు సూర్యం, నరేష్, ప్రతిభ, సుధారాణి, వేణు, దుర్గాప్రసాద్, స్వర్ణలత, ఎస్‌ఐ రాజారాం తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామం నుంచి తిరుమలాపురం వరకు నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పూర్ణయ్య ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి భట్టివిక్రమార్క రూ.2.75 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు, కొరివీరయ్య, గోదా రామారావు, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామం నుంచి బోనకల్ మండలం తూటికుంట్ల వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, రైతులు శనివారం భూమిపూజ చేశారు.

రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు

వైరా: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గన్నవరానికి చెందిన డి.లింగారెడ్డి శనివారం బైక్‌పై వెళ్తూ వైరాలోని ఎంపీఐ కార్యాలయం వద్ద రోడ్డు దాటుతుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లింగారెడ్డిని 108లో ఖమ్మం తరలించారు.

కారేపల్లి మండలంలో...

కారేపల్లి: ఎదురెదురుగా రెండు బైక్‌లో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కారేపల్లి వెంకటసాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చాందావత్ లక్ష్మణ్ శనివారం తెల్లవారుజామున భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో విధినిర్వహణకు బైక్‌పై బయలుదేరాడు. అదేసమయాన కారేపల్లి మేదర బజార్‌కు చెందిన మణికొండ పవన్ బైక్‌పై ఎదురుగా వస్తుండగా ఆలియాతండా సమీపంలోని మూలమలుపు వద్ద ఢీకొనగా ఇద్దరి కాళ్లు విరిగి గాయాలయ్యాయి. ఈమేరకు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అప్పగింత

తల్లాడ: తల్లాడలో ఇటీవల పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను శనివారం తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు బాధితులకు అప్పగించారు. మిట్టపల్లికి చెందిన పి.ఆనందకృష్ణ, కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన బి.భార్గవ్ మొబైల్ ఫోన్లు పొగొట్టుకోగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై సాంకేతిక పద్ధతిలో మొబైల్ ఫోన్లను గుర్తించి అప్పగించారు.


వివిధ రకాల డిజైన్లలో ప్రమిదలు


గురుగులు


కొబ్బరికాయ డిజైన్‌లో..


హంస ఆకారంలో..


ఆకర్షణీయంగా...

దీపావళి శోభ

మార్కెట్లో ఆకట్టుకుంటున్న వివిధ రకాల ప్రమిదలు

సండే స్పెషల్

సత్తుపల్లిటౌన్: దీపావళి పండుగకు ప్రతి ఇళ్లు దీపాలతో వెలుగులు నింపుతుంది. ఈ దీపాలను వెలిగించేందుకు ఉపయోగించే ప్రమిదలు ఎంపిక వారంరోజుల ముందు నుంచే జరుగుతోంది. ఈ నెల 31వ తేదీన దీపావళి పర్వదినం కావటంతో సత్తుపల్లితో పాటు మధిర, వైరా, ఇతర పట్టణాల్లో ప్రమిదల విక్రయాలు చేపట్టారు.

కొనుగోళ్ల సందడి..

ఏడాదికోసారి జరుపుకునే దీపావళి పండుగకు బొమ్మల కొలువు కోసం బొమ్మలు, ప్రమిదలను వెలిగించేందుకు వాటి కొనుగోళ్లతో సందడి నెలకొంది. ఇళ్ల ముందు దీపాలు వెలిగించి అలంకరించటం సాంప్రదాయం. ఎన్నిరకాల ఆకర్షణీయమైన విద్యుత్ లైట్లు అందుబాటులో ఉన్నా.. సాంప్రదాయంగా వస్తున్న ప్రమిదలను వెలిగించి ఇళ్ల ముందు దీపావళి ముందు నుంచి రెండు రోజులపాటు కార్తీకమాసం అంతా అందంగా అలంకరిస్తుంటారు. ఇంటింటా దీపాలు వెలుగులు విరజిమ్మేందుకు మార్కెట్‌లోకి వివిధ ఆకర్షణీయమైన ప్రమిదలు వచ్చేశాయి. దీపావళితో పాటు కార్తీకమాసం నవంబర్ 2వ తేదీ నుంచి ఉండటంతో పూజలకు ప్రమిదలను ఎక్కువగా వినియోగిస్తుంటారు.

డిజైన్లలో ప్రమిదలు..

దీపావళి పర్వదినం సమీపిస్తుండటంతో ప్రమిదల దుకాణాలు వెలుస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో విక్రయాలతో పాటు సైకిళ్లు, బుట్టల్లో పెట్టుకొని వీధుల్లో విక్రయాలు చేపడుతున్నారు. మార్కెట్‌లో పింగాణి ప్రమిదలు కూడా వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా ఉన్నాయి. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల నుంచి విక్రయిస్తున్న వివిధ రకాల డిజైన్, ఫ్యాన్సీ ప్రమిదలు ఆకట్టుకుంటున్నారు. వీటితో పాటు మట్టితో తయారు చేసిన ఆకాశదీపం కుందులు, 360 ఒత్తులు వెలిగించే కుందులు, కొబ్బరికాయ, తాబేలు, హంసా, దేవతామూర్తులు ఆకారాలలో ప్రమిదలు ఉన్నాయి. దీపావళికి లక్ష్మీదేవి వ్రతాలను ఆచరించేందుకు లక్ష్మీదేవి ప్రతిమలు కూడా మార్కెట్‌లోకి అందుబాటులో లభిస్తున్నాయి.


సత్తుపల్లిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాం..



దీపావళి పండుగ, కార్తీక మాసం కోసం ఇతర రాష్ట్రాల నుంచి డిజైన్ ప్రమిదలను తెప్పించాం. దాదాపు 50 రకాల డిజైన్ ప్రమిదలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది అమ్మకాలు లేవు. ఈ ఏడాదైనా అమ్మకాలు ఉంటాయని ఆశిస్తున్నా.

– మొగిలి జయమ్మ, సత్తుపల్లి

జమలాపురంలో హైకోర్టు న్యాయమూర్తుల పూజలు


జమలాపురం ఆలయంలో పూజలు చేస్తున్న న్యాయమూర్తులు

ఎర్రుపాలెం: మండంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తులు పి.శ్రీసుధ, కాజా శరత్, భీమపాక నగేష్ సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డితో కలిసి ఆలయానికి వచ్చిన వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. తొలుత జడ్జిలకు అధికారులు, అర్చకులు స్వాగతం పలకగా పూజల అనంతరం ప్రసాదం, శేషవస్త్రాలతో సన్మానించారు. తహసీల్దార్ ఉషాశారద, ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

గురుదక్షిణ భవనం ప్రారంభం..


సిరిపురంలో భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి శరత్

మధిర: మధిర మండలం సిరిపురంలో బాపూజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యాన నిర్మించిన గురుదక్షిణ భవనాన్ని హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో వసతులు కల్పించడం అభినందనీయం అన్నారు. పూర్వ విద్యార్థులు చెన్నారెడ్డి, రామ్మోహన్ రావు, గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రావు, లాలయ్య, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టేడియంల ఏర్పాటుకు కృషి


అధికారులతో మాట్లాడుతున్న దయానంద్

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో ఔట్‌డోర్ స్టేడియం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియంను రూ.6 కోట్లతో ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ తెలిపారు. పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం మైదానాలను పరిశీలించారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా స్టేడియంలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఏఈ సురేష్, జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు ఎం.డీ.కమల్‌పాషా, దొడ్డా శ్రీనివాసరావు, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సకల సౌకర్యాలు కల్పిస్తాం..

పెనుబల్లి: మండలంలోని కేడబ్ల్యూ చౌడవరం పంచాయతీ సమీపంలో అడవిలో నివసిస్తున్న ఆదివాసీల జీవనానికి సకల సౌకర్యాలు కల్పిస్తామని కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. శనివారం ఆయన అడవీప్రాంతంలోని ఆదివాసీ నివాస ప్రాంతానికి వెళ్లి ఇటీవల సింగరేణి సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సోలార్ మోటారు పంపు సెట్‌ను, సోలార్ లైట్లను పరిశీలించారు. రహదారి వెంబట మరికొన్ని సోలార్ లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమకు కులధృవీకరణ పత్రం కావాలని కోరగా.. స్పందించిన ఆయన తహసీల్దార్ ప్రతాప్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, నాయకులు రామారావు, కరీముల్లా, కోటేశ్వరావు, కిషోర్, నవజీవన్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన..

మండలంలోని ఏరుగట్ల, కేడబ్ల్యూ చౌడవరం గ్రామాల మధ్య ఉన్న మెటల్ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలకు చేసిన మరమ్మతు పనులను దయానంద్ పరిశీలించారు.

విద్యుత్‌ను ఆదా చేయండి


పండ్రేగుపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఈ నాగేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు

ముదిగొండ: రైతులు తప్పని సరిగా కెపాసిటర్లు వాడి విద్యుత్‌ను ఆదా చేయండని విద్యుత్‌శాఖ ఖమ్మం రూరల్ డీఈ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని పండ్రేగుపల్లిలో విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్, ఎల్ఐ కృష్ణమూర్తి ఏఎల్ఎం రమేష్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలం బాటలో విద్యుత్ శాఖ..

వైరారూరల్: మండలంలోని స్టేజీపినపాక గ్రామంలో శనివారం వైరా టౌన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.సుందర్ కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ పొలంబాట నిర్వహించారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పరిశీలించారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు కృష్ణయ్య వీరభద్రం, రైతులు తదిరుతులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన


మడుపల్లి శివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం మడుపల్లి గ్రామంలోని పురాతన శివాలయాన్ని సందర్శించారు. క్రీస్తు శకం 11వ శతాబ్దానికి చెందిన తూర్పు చాళుక్య రాజు రాజరాజ నరేంద్రుడు ఇక్కడ తాను సాధించిన విజయానికి గుర్తుగా శివాలయాన్ని నిర్మించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఇక్కడ ఉన్న శివుడిని రాజరాజ నరేంద్ర స్వామి అని పిలుస్తారని తెలిపారు. ధ్వజస్తంభం పక్కన ఉన్న నందీశ్వరుడిపై బ్రహ్మీ లిపిలో శాసనం, సూర్య చంద్రుల గుర్తులు చెక్కి ఉన్నట్లు తెలిపారు. గర్భగుడి చుట్టూ రాతి గోడలపై వివిధ జంతువుల గుర్తులు చెక్కి ఉన్నాయని తెలిపారు. వీటన్నింటినీ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పరిశీలించి రికార్డు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ అరుణ, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఇందిర, అధ్యాపకులు నాగరాణి, శివకుమారి, అఫ్రోజ్, సురేష్ పాల్గొన్నారు.

వార్డ్ ఆఫీసర్‌పై దాడికి నిరసన


మధిర: వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం మధిర మున్సిపల్ కార్యాలయం వద్ద వార్డు ఆఫీసర్లు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డ్ ఆఫీసర్లు రామ్మూర్తి, నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. వివాదంలో ఉన్న ఫైల్ మీద సంతకం పెట్టమని కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ భర్త పాగాకు విశ్వేశ్వర్ వార్డ్ ఆఫీసర్ జయరాములును అడగ్గా... సంతకం చేయనని చెప్పడంతో సాక్షాత్తు మేనేజర్ సమక్షంలో వార్డ్ ఆఫీసర్‌పై దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం జరిగిందన్నారు. ఈ ఘటనకు కారణమైన చైర్‌పర్సన్ భర్తపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఆన్ డ్యూటీలో ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రన్న గౌడ్, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా అయినాల


రామలింగేశ్వరరావు

తల్లాడ: సీపీఎం తల్లాడ మండల కార్యదర్శిగా అయినాల రామలింగేశ్వరరావును శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండలంలోని అన్నారుగూడెంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభలో.. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. రామలింగేశ్వరరావుతో పాటు మరో 15మందితో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మాచర్ల భారతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు మండల కార్యదర్శిగా నాగేశ్వరరావు..


నాగేశ్వరరావు


ఏన్కూరు: సీపీఎం మండల కార్యదర్శిగా దొంతబోయిన నాగేశ్వరరావు మూడోసారి ఎన్నికయ్యారు. మండలంలోని ఆరికాయలపాడులో శుక్రవారం జరిగిన సీపీఎం మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నాగేశ్వరావుతో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


సిరిపురం ప్రభుత్వ కళాశాల, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం

మధిరరూరల్: మండలంలోని సిరిపురం బాపూజీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కర్నాటి రామ్మోహన్ రావు, అధ్యక్షుడిగా చెన్నారెడ్డిని ఎన్నుకున్నారు. అదే విధంగా పూర్వ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడిగా గుజ్జు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కనకపుడి లాలయ్య, సహాయ కార్యదర్శిగా మనోహర్, కోశాధికారిగా శ్రీనివాసరావు తదితరులను ఎన్నుకున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కార్యవర్గం ఎన్నిక


తల్లాడ మండల నూతన కార్యవర్గం

తల్లాడ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోర్ కమిటీ రాష్ట్ర చైర్మన్ కేవీ కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం తల్లాడ మండల ఉద్యమకారుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోదుగు ఆశీర్వాదం సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికలో ఫోరం తల్లాడ మండల అధ్యక్షుడిగా గోపయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా వెంకటనారాయణ, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా లాలయ్యను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

29న డయల్ యువర్ డీఎం

మధిర: ఈ నెల 29న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ శంకర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ఉన్న ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సలహాలు, సూచనలు, అదేవిధంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు 9959225961 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సు

వైరారూరల్: వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం కామిశెట్టి సుబ్బారావు (ఫ్రీడర్ ఫైటర్) ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు కామిశెట్టి రాజారావు, రవికుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలైన బీపీ, షుగర్, అధిక బరువు, డయాబెటిస్, సంతానలేమి తదితర సమస్యలకు డాక్టర్ మాచినేని రామకృష్ణ జనరిక్ మందుల వినియోగం లేకుండా దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొనున్న నేపథ్యాన మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఎడ్లబండ్లకు అనుమతి ఇవ్వాలి

మధిర: ఎడ్లబండ్లతో ఇసుక తోలుకుంటున్న వారికి అనుమతి ఇవ్వాలని కోరుతూ.. ఇసుక బండ్ల యజమానుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పదిలం కొండ, రెడపంగి ఏసు, సంపసాల లింగరాజు తదితరులు మాట్లాడారు. ఎడ్ల బండ్లతో ఇసుకను తోలుతూ.. జీవనం సాగిస్తున్న వారిని అధికారులు అడ్డుకొని జీవనోపాధి లేకుండా చేస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కోటేశ్వరరావు, సూరి, రామకృష్ణ, నరసింహారావు, నాగేశ్వరరావు, కృష్ణయ్య, దానయ్య ఉన్నారు.

నేత్రదానం

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్‌కు చెందిన కంఠమనేని ధర్మారావు అనారోగ్యంతో శనివారం మృతి చెందగా సప్తపది లయన్స్‌క్లబ్ సభ్యులు ధర్మారావు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించడంతో నేత్రాలను టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించి ఖమ్మం నేత్రనిధికి అందించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఎస్‌కే అబ్దుల్ సలాం, అధ్యక్షులు సుబ్బారావు, రాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

తల్లాడ: ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఇంటర్ స్కూల్ టేబుల్ టెన్నిస్ కాంపిటీషన్ సీజన్–3 లో స్థానిక బాలభారతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కేఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రవీణ్, కోచ్ సాంబమూర్తి, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని యజమానుల సమస్యలపై రాష్ట్ర రవాణా, బీసీ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి హైదరాబాద్‌లో కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కల్లూరు, పెనుబల్లి, తల్లాడ బస్టాండ్ సమస్యలను ప్రస్తావించినట్లు తెలిపారు.

‘మిస్ట్’లో వికసిత్ భారత్‌పై సెమినార్



మాట్లాడుతున్న ఆచార్య అజిత్

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం వికసిత్ భారత్ అనే అంశంపై బీటెక్, ఎంబీఏ విద్యార్థులకు లైఫ్ టీచర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆచార్య అజిత్ ఆధ్వర్యంలో సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. యువత ఆలోచన దేశాభివృద్ధి, నాయకత్వం వైపు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరి కృష్ణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామచంద్రరావు, మారేశ్వరరావు, అన్ని విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించుకుందాం..

ఎర్రుపాలెం: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబల్లి నర్సిరెడ్డికే మద్దతు ఇవ్వాలని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు కోరారు. శనివారం మండలంలోని భీమవరం, మామునూరు ఉన్నత పాఠశాలలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, పుల్లారావు, వెంకమ్మ, శైలజ, కుమారి ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


భోజనం ప్లేట్లు అందిస్తున్న ఎంఈఓ రమణయ్య

ముదిగొండ: మండలంలోని పమ్మి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎంఈఓ రమణయ్య నోట్‌బుక్స్, భోజనం ప్లేట్లు, ప్యాడ్లు, కాపీ రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం సురేష్ రూ.10వేలు విలువైన నోట్ బుక్స్ పంపిణీ చేశారు. చిరుమర్రి, ముదిగొండ, కాప్లెక్స్ హెచ్ఎం ప్రసాద్, శాంతి, ఉపాధ్యాయులు సురేష్, రమణారెడ్డి, షర్మిల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల నిరసన

ముదిగొండ: పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు ముత్తారం తాగునీటి సరఫరా వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఏడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సైదులు, ప్రసాద్, అంజయ్య, శ్రీను, నాగయ్య, వీరబాబు, రవి, వినోద్, హరీష్, రజిత, రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరామర్శ..

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నన్నక రామారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘సాయిస్ఫూర్తి’లో ముగిసిన వర్క్‌షాప్


అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ అభినవ్

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ) మూడో సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. దీంతో ఈసీఈ విద్యార్థులు ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల్లో కొలువులు సాధిస్తారని హైదరాబాద్‌కు చెందిన రిసోర్స్ పర్సన్ అభినవ్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ.. రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమీప భవిష్యత్‌లో దేశంలో గణనీయమైన స్థాయిలో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ శేఖర్‌బాబు, కోఆర్డినేటర్ నాగశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.